

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

ఎఫ్ఎన్‌సీసీకి నా సహకారం ఉంటుంది

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

బంజారాహిల్స్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ)కి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆయన నర్సాపురం ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా సోమవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో నంబర్ వన్ స్థానంలో ఉన్న ఎఫ్ఎన్‌సీసీ ఎన్నో రకాల స్పోర్ట్స్ టోర్నమెంట్లతో పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని కొనియాడారు. ఈ సందర్భంగా ఎఫ్ఎన్‌సీసీ సెక్రటరి ముళ్లపుడి మోహన్, సంయుక్త కార్యదర్శి వివిఎస్.పెద్దిరాజు, కోశాధికారి రాజశేఖర్ రెడ్డి, బాలరాజు, ఏడిదరాజు, సామ ఇంద్రపాల్‌రెడ్డి ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు మాగంటి మురళీమోహన్, రచయిత పరుచూరి గోపాలకృష్ణ, చాంబర్ సెక్రటరీ దామమోదర్ ప్రసాద్, నిర్మాతల మండలి సెక్రటరి ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వయస్సు పెరుగుతున్న కొద్దీ రోగ నిరోధక శక్తి తగ్గుతుంది

రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల



మాట్లాడుతున్న డాక్టర్ రమేశ్

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వయస్సు పెరుగుతున్న కొద్దీ రోగ నిరోధక శక్తి తగ్గుతుందని రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ రమేశ్ కంచర్ల పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన అడల్ట్ వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోగ నిరోధక శక్తి తగ్గుదల విషయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. ఇమ్యూనిటీని పెంచుకొని వ్యాధుల బారిన పడకుండా పెద్దలు కూడా వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. వ్యాక్సినేషన్ పిల్లలకే కాదని, పెద్దలకు కూడా అవసరమన్నారు. వారికి అవి ప్రాణధారాలు అని అన్నారు. పెద్దలకు రోగ నిరోధక శక్తిని పెంచడానికి టీకాలు వేస్తున్నామని ఆయన చెప్పారు. ప్రతి ఏడాది తప్పక వ్యాక్సిన్లు తీసుకోవాలన్నారు. తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లు, కేన్సర్‌ను నిరోధించే ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్, హెచ్‌పీవీ వ్యాక్సిన్, న్యూమోకోక్కల్ వ్యాక్సిన్, షింగిల్స్ వ్యాక్సిన్లను అవాన్ కార్యక్రమం ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు.



గచ్చిబౌలి సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

డిమాండ్‌కు తగిన విధంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లలో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తోంది విద్యుత్‌శాఖ. సైబర్‌సిటీ సర్కిల్ గచ్చిబౌలి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న 12.5 ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రంగారెడ్డి జోన్ సీఈ పి.ఆనంద్, సైబర్‌సిటీ ఎస్ఈ పి.వెంకన్న తనిఖీ చేశారు. ఈ సర్కిల్ పరిధిలో పెరుగుతున్న లోడ్‌కు తగినట్లు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు(పీటీఆర్) ఏర్పాటు చేస్తునట్లు వారు తెలిపారు. రానున్న సమ్మర్‌లో పెరిగే డిమాండ్‌ను అంచనా వేస్తూ సబ్‌స్టేషన్లలో పీటీఆర్ సామర్థ్యం పెంచడంతో పాటు అవసరమైన చోట కొత్త పీటీఆర్‌లు ఏర్పాటు చేస్తోంది.

వర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లను నియమించాలి

తార్నాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్లను వెంటనే నియమించి విద్యావ్యవస్థను పటిష్టం చేయాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీల్లో ఇన్‌చార్జి ఐఏఎస్‌ల పాలన వలన పరిశోధనాపరమైన అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. అలాగే పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. వీసీల నియామకాల్లో ఎటువంటి రాజకీయ జోక్యం, అవినీతికి ఆస్కారం లేకుండా అకడమిక్, పరిశోధన రంగాల్లో అనుభవం కలిగిన ప్రొఫెసర్లను నియమించాలని విజ్ఞప్తి చేశామన్నారు. అదేవిధంగా వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పులిగంటి సురేష్, పులిగంటి వేణు, శివశంకర్, రాజు, రవి, శ్రీనివాస్ కుమార్, చందు, బాలు, వేణు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ కొంటానని చోరీ చేసిన యువతి

యూసుఫ్‌గూడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ల్యాప్‌టాప్ కావాలని షాపుకు వచ్చిన యువతి చోరీకి పాల్పడింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 28న ఎస్ఆర్ నగర్‌లోని ఎలక్ట్రానిక్ షాపుకు ఓ యువతి వచ్చింది. అక్కడున్న రాజీవ్‌గౌడ్ అనే సేల్స్‌మన్‌తో ల్యాప్‌టాప్ కావాలని చెప్పింది. అతను ల్యాప్‌టాప్‌లు చూపించాడు. కొంత సేపు చూసి వాటి వివరాలు తెలుసుకుని, తన ఫ్రెండ్ వస్తున్నాడు వచ్చాక తీసుకుంటానని చెప్పి అక్కడ కూర్చుంది. దీంతో రాజీవ్ మరో కస్టమర్‌తో మాట్లాడేందుకు వెళ్లి వచ్చాడు. ఇంతలో అక్కడ ఆ యువతితో పాటు ల్యాప్‌టాప్ కనిపించలేదు. చోరీ చేసిందని గుర్తించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిగరెట్ పీకలు వేయొద్దన్నందుకు దాడి

యూసుఫ్‌గూడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సిగరెట్లు తాగి పీకలు తమ ఇంటి ఎదుట వేయొద్దన్నందుకు దాడి చేశారు పలువురు యువకులు. ఈ ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధార్థ్ నగర్ కాలనీలోని ప్రశాంత్ అపార్ట్‌మెంట్‌లో సమ్మయ్య అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఆ పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌లో ఉండే ముగ్గురు యువకులు రోజూ సిగరెట్లు తాగి పీకలు సమ్మయ్య ఇంటి వైపు వేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సమ్మయ్య భార్య ఆ యువకులతో సిగరెట్ పీకలు వేయొద్దని చెప్పింది. దీంతో వారు ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ఈ విషయాన్ని ఆమె కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తన కుమారుడు సాగర్‌కు తెలిపింది. సాగర్ సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత తన తల్లిని ఎందుకు తిట్టారని ఆ యువకులను నిలదీశాడు. అప్పటికే మద్యంలో మత్తులో ఉన్న నరేశ్ చౌదరి, మనోహర్‌రెడ్డి, మోహిత్‌నాగేంద్రలు సాగర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చందా నాయక్ తండాలోని రోడ్డుపై పారుతున్న మురుగు



దోమలకు ఆవాసంగా మారిన డ్రైనేజీ నీరు

రోడ్లపైనే మురుగు

- పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్
- చందానాయక్ తండాలో ఏడాదంతా ఇదే పరిస్థితి
- హైటెక్ సిటీకి అతి సమీపంలోనే..
- అయినా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో స్థానిక ప్రజలు

మోతీనగర్ జూలై 29(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలు చూస్తుంటే వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు అని అనుకుంటున్నారు కదూ.. అలా అనుకుంటే పొరబడినట్లే.. ఎందుకంటే ఈ రోడ్లపై ఉన్నది వర్షపు నీరు కాదు.. పొంగిన డ్రైనేజీ మురుగు. మాదాపూర్ పరిధిలోని హైటెక్ సిటీకి అతి సమీపంలోని చందానాయక్ తండాలోని ప్రధాన రోడ్ల దుస్థితి ఇది. ఈ రోడ్లపై ఏడాది పొడవునా ఇలా డ్రైనేజీ నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. వర్షాకాలం.. చలి కాలం... చివరకు ఎండాకాలమైనా.. ఇదే పరిస్థితి. ఈ ప్రాంతంలో నిత్యం ఇలా మురికి నీరు ప్రవహిస్తుండటంతో విపరీతమైన దుర్గంధంతో రోడ్లన్నీ బురదతో నిండి దర్శనమిస్తుంటాయి. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు ముక్కు మూసుకోవాల్సిందే. ఈ బురద వల్ల ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి తరచూ రోడ్లపై పడిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఏర్పడిన పారిశుధ్య నిర్వహణ లోపం వల్ల దోమల సమస్య సైతం విపరీతంగా ఉంటుంది. ఏడాది పొడవునా ఈ పరిస్థితి ఉంటుండటంతో స్థానిక ప్రజల పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నిత్యం ఐటీ ఉద్యోగులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అయినా ఈ సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ అధికారులు చొరువ చూపని పరిస్థితి. దీంతో ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

ఇక్కడ రోడ్లు ఎప్పుడు చూసినా వర్షాకాలంలో రోడ్ల వలె డ్రైనేజీ నీటితో ప్రవహిస్తూ ఉంటాయి. మా ఏరియాలోకి రావాలంటేనే చాలామంది వెనక్కి తగ్గుతున్నారు. మాకైతే తప్పదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

-భాస్కర్ నాయక్, స్థానిక నివాసి

దోమలతో తరచూ అనారోగ్యం

డ్రైనేజీ నీటితో రోడ్లన్నీ బురదతో నిండిపోయాయి. దుర్వాసనకు తోడు విపరీతమైన దోమల బెడద.. దీంతో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నాం. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మా సమస్య పరిష్కారం కావడం లేదు.

-సునంద, టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలు



గజ్జెలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానిక యువకులు



గజ్జెలమ్మ అమ్మవారు

తొట్టెల ఊరేగింపుతో ముగిసిన బోనాలు

ఖైరతాబాద్, జూలై29(ఆంధ్రజ్యోతి): ఆషాఢ బోనాల వేడుకలు రెండో రోజు సోమవారం సైతం వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి తొట్టెల ఊరేగింపులు ఘనంగా నిర్వహించగా ఆలయాల నిర్వాహకులు ఫలాహారం బండ్లను శోభాయమానంగా తీశారు. ఈ కార్యక్రమాల అనంతరం ఖైరతాబాద్ గజ్జెలమ్మ దేవాలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు అన్ని పార్టీల నాయలు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించిన వారిలో ఆలయ నిర్వాహకులు రాకేశ్, ముఖేష్, గజ్జెల ఆనంద్, రవికాంత్‌రెడ్డి, వినోద్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖైరతాబాద్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు వైభవంగా జరిగింది. ఇందిరానగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన ఫలాహార బండి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. న్యూ సీబీఐ క్వార్టర్స్‌లోని దుర్గాభవాని దేవాలయం, మహాకాళి దేవాలయాల ఆధ్వర్యంలో ఫలాహార బండ్ల ఊరేగింపులు వైభవంగా జరిగాయి. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి

అందరిని చల్లగా చూస్తా : భవిష్యవాణి చెప్పిన రేణుక



మహాకాళి ఆలయంలో భవిష్యవాణి వినిపిస్తున్న రేణుక

ఖైరతాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, రైతులు సంతోషంగా ఉంటారని అలాగే ప్రజలందరినీ చల్లగా చూస్తానని రంగం కార్యక్రమంలో రేణుక తెలిపారు. సోమవారం ఖైరతాబాద్ మహాకాళి దేవాలయంలో రంగం కార్యక్రమం ఘనంగా జరిగింది. లాల్‌బజార్‌కు చెందిన రేణుక పచ్చి కుండపై నిల్చొని పూనకంతో భవిష్యవాణి వినిపించారు. బోనాల పూజలతో తాను సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. తనకు ఐదు వారాల పాటు ముత్తేదువులు నీళ్ల శాఖలు పోయాలని అమ్మవారి పూనకంతో భవిష్యవాణి వినిపించింది. కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఆలయ చైర్మన్ భవాని కృష్ణ యాదవ్, అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి మధుకర్ యాదవ్, బాలయ్య యాదవ్, చౌదరి, యాదయ్య యాదవ్, రాము యాదవ్, లక్ష్మణ్ యాదవ్, మహేష్ యాదవ్, రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కావడి పాల్కొడి ఉత్సవం



కావడితో ఆలయంలోకి వెళ్తున్న భక్తులు

పద్మారావునగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్, స్కందగిరిలోని శ్రీ సుబ్రమణ్యస్వామి దేవాలయంలో సోమవారం తైపూసం ఆడికృతిక సందర్భంగా కావడి పాల్కొడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుంచే వందల సంఖ్యలో భక్తులు కావడి, పాలకుండలతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. మేళతాళాల నడుమ, భక్తిపారవశ్యంతో నృత్యాలు చేస్తూ కావడి, పాలకుండలతో గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పాల కుండలతో సుబ్రమణ్యా స్వామిని అభిషేకించిన తర్వాత దర్శించుకున్నారు. ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక నగరంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమ అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

592 రూట్‌లో ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ నుంచి శివారు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు పెంచేదిశగా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. కొత్తగా 592 రూట్‌లో మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికి 3 బస్‌ట్రిప్పులను మంగళవారం నుంచి నడుపుతున్నట్లు ఈడీ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సులు మెహిదీపట్నం నుంచి వయా నానల్‌నగర్, లంగర్‌హౌస్, టీకేబ్రిడ్జి, బండ్లగూడ క్రాస్ రోడ్, ఆరెమైసమ్మ, అప్పా, గోల్డెన్ ఫామ్స్ ఉస్మాన్‌సాగర్ క్రాడ్‌రోడ్స్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ క్రాస్‌రోడ్, మోయినాబాద్, కనకమామిడి ఎక్స్‌రోడ్, కందవాడ ఎక్స్‌రోడ్, మల్లాపూర్, కాసారం, కందవాడ, చేవేళ్ల వరకు బస్సులు నడుపుతామన్నారు.

క్వారీ గుంతలో మునిగి బాలుడి మృతి



క్వారీ నుంచి బాలుడి మృతదేహాన్ని బయటకు తెస్తున్న స్థానికులు

పేట్‌బషీరాబాద్, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన బాలుడు క్వారీ గుంతలో మునిగి మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కైసర్‌నగర్‌లో నివాసం ఉండే సల్మాన్‌కు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు సోయల్(10) కైసర్‌నగర్‌లోని మదర్సాలో చదువుతున్నాడు. సోమవారం స్కూల్‌కు సెలవు కావడంతో అదే ప్రాంతంలో ఉంటున్న మరో ముగ్గురు స్నేహితులతో కలిసి సోయల్ ప్రగతినగర్ సమీపంలో ఉన్న క్వారీ గుంతలో ఈత కొట్టడానికి వెళ్లారు. క్వారీ గుంతలో దిగిన ముగ్గురు బయటకు రాగా ప్రమాదవశాత్తు సోయల్ క్వారీ గుంతలోని రాళ్లలో ఇరుక్కుపోయాడు. దీంతో బయటకు రాలేక నీళ్లలోనే మునిగిపోయాడు. స్నేహితులు వారి బస్తీకి వచ్చి స్థానికులకు విషయం తెలిపారు. సమాచారం అందుకున్న బస్తీవాసులు క్వారీ గుంత వద్దకు చేరుకొని, జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. క్వారీ గుంతలోకి స్థానికులు దిగి సోయల్‌ను వెతికి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే బాలుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాధచాయలు అలుముకున్నాయి. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు చేయాలి

ఖైరతాబాద్, జూలై29(ఆంధ్రజ్యోతి): ఆయుష్ విభాగంలో బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని, జీవో 80ని అమలు చేయడం లేదని అఖిల భారత షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల హక్కుల పరిరక్షణ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రాసూరి చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రపతి ఉత్తర్వులకు వ్యతిరేకంగా బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు. బదిలీలపై నాలుగు సంవత్సరాలు దాటిన వారిని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నా, కేవలం ఒక సంవత్సరం సర్వీసు చేసిన వారిని బదిలీ చేస్తున్నారన్నారు. కాగా, 20 సంవత్సరాలుగా ఒకే దగ్గర పనిచేసే వాళ్లను అక్కడే ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బదిలీల కౌన్సెలింగ్ కోసం సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు జూనియర్లకు ప్రాధాన్యత ఇవ్వడం, షెడ్యూల్ కులాలు, తెగల వారికి బదిలీల్లో నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదన్నారు. ఈ విషయమై ఆయుష్ డైరెక్టర్‌తో పాటు ఆ శాఖముఖ్య కార్యదర్శికి వినతి పత్రాలు అందించామని తెలిపారు. బదిలీల ప్రక్రియలో జాయింట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్‌లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించిన ఆయన వెంటనే బదిలీల విషయంలో డైరెక్టర్ కలగజేసుకొని నిబంధనల ప్రకారం జరపాలని డిమాండ్ చేశారు.

గొల్ల, కురుమలను విస్మరించిన ప్రభుత్వం

నేటి నుంచి ఆగస్టు 15 వరకు 'మందబాట'

బర్కత్‌పుర, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గొల్లకురుమలను అన్ని రంగాల్లో పూర్తిగా విస్మరించిందని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరియాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ ఆరోపించారు. గొర్రెల కాపరులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని వారు ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి వర్గంలో గొల్ల, కురుమలకు స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 30 నుంచి ఆగస్టు 15 వరకు గ్రామాలలో మందబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15 తరువాత నగరంలో లక్షలాది మందితో గొర్ల కాపరుల జనజాతర నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. రాష్ట్రంలో యాదవ కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేసి రూ.10 వేల కోట్లను కేటాయించాలన్నారు. గొర్రెల కాపర్లకు జీవాలమేత, వైద్యం, షెడ్లు, మార్కెటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని, అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నేతలు అయోధ్య యాదవ్, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, దేవరాజుయాదవ్, రాములుయాదవ్, చంద్రమౌళి యాదవ్, సత్యం యాదవ్, నాగరాజు యాదవ్, సమ్మయ్యయాదవ్, సాగర్ యాదవ్, సూర్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణను పట్టించుకోని ప్రైవేటు హాస్టళ్లను మూసివేయాలి

డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావిద్

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నిర్వహణను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రైవేట్ హాస్టళ్లను మూసివేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జావిద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని అమీర్‌పేట్, చిక్కడపల్లి, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకునేందుకు వచ్చిన నిరుద్యోగుల జీవితాలతో హాస్టల్ నిర్వాహకులు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కనీస వసతులు కల్పించకున్నప్పటికీ నెలకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ఢిల్లీలో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి నిర్వహణ సరిగాలేని హాస్టళ్లను మూసివేసి నిరుద్యోగులను కాపాడాలని ఆయన కోరారు.

మోగిన హెచ్ఏఎల్ యూనియన్ ఎన్నికల నగారా

ఆగస్టు 12న నామినేషన్ల స్వీకరణ ● 30న ఎన్నికల నిర్వహణ

బాలానగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): బాలానగర్‌లోని హిందూస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్ -హైదరాబాద్ డివిజన్) కార్మిక యూనియన్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఆగస్టు 30న ఎన్నికలు నిర్వహించాలని సంస్థ మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. ఆగస్టు 12న నామినేషన్ల స్వీకరణ, 13న ఉపసంహరణ, 30న ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించాలని సంస్థ తీర్మానించింది. ఈ ఎన్నికల్లో సంస్థలో ఉన్న మొత్తం ఆరు యూనియన్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి ఉన్నప్పటికీ కొన్ని యూనియన్లు కలిసి కూటమిగా ఏర్పడనున్నట్లు కార్మిక సంఘాల నేతలో చర్చ జరుగుతోంది. సంస్థలో పనిచేసే 892 మంది కార్మికులు బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. వీరితో పాటుగా 56 మంది కార్మికులు (35 మంది కేరళ కాసర్‌గడ్ కార్మికులు, 21 మంది ఔట్ స్టేషన్ కార్మికులు) పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

క్రైస్తవుల హక్కులను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్‌జాన్

నిజాంపేట్, జూలై 29(ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సంఘాల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలంగాణ ఆ సంఘ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. నిజాంపేట్ రాక్ చర్చిలో క్రిస్టియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పాస్టర్ల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగిస్తూ క్రైస్తవుల హక్కులను కాపాడుకోవాలన్నారు. ముఖ్యంగా క్రైస్తవుల సమాధి తోట, కమ్యూనిటీ హాల్స్ విషయంలో తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో క్యూసీసీఏ చైర్మన్ పాస్టర్ శౌరి, జనరల్ సెక్రటరీ పాస్టర్ అబ్రహమ్, జామవా పుచ్చకాయల, జేమ్స్, ఫెలోషిప్, జగదీకకుమార్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై మరో ప్రమాదం



గాయపడ్డ యువకుడు

ఖైరతాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై సోమవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనంపై వెళ్లూ ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా కారు యజమాని ఈ విషయమై ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, గాయపడ్డ యువకుడు మాత్రం ఫిర్యాదు ఇవ్వలేదని, అతడి వివరాల కోసం ఆరా తీస్తున్నామని పోలీసులు తెలిపారు.

వరుస ప్రమాదాలపై అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై తనిఖీలు చేస్తున్న పలు శాఖల అధికారులు

ఖైరతాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై వరుస ప్రమాదాలు జరుగుతున్న వైనంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. సోమవారం పోలీసు శాంతి భద్రతల విభాగం, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ప్రమాదాలు జరుగుతున్న రోడ్డును పరిశీలించారు. ప్రమాదాలు జరగడానికి కారణాలపై ఆరా తీసి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జీహెచ్ఎంసీతో పాటు ట్రాఫిక్ విభాగం ఇంజనీరింగ్ అధికారులు ఫ్లైఓవర్‌పై వేగాన్ని నిరోధంచడం కోసం రంబుల్ స్ట్రిప్స్ వేయాలని, మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, స్పీడ్ లిమిట్, నెమ్మదిగా వెళ్లాలని సూచించే ట్రాఫిక్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి తదితరులు

తెలంగాణలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్‌లను నియమించాలి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి

తార్నాక, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్‌లను నియమించి విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీల్లో ఇన్‌చార్జి ఐఏఎస్‌ల పాలన వలన పరిశోధనాపరమైన అభివృద్ధి కుంటుపడుతుందని, పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. వీసీల నియామకాల్లో ఎటువంటి రాజకీయ జోక్యం, అవినీతికి ఆస్కారం లేకుండా అకడమిక్, పరిశోధన రంగాల్లో అనుభవం కలిగిన ప్రొఫెసర్లను నియమించాలని విజ్ఞప్తి చేశామన్నారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పులిగంటి సురేష్, పులిగంటి వేణు, శివశంకర్, రాజు, రవి, శ్రీనివాస్ కుమార్, చందు, బాలు, వేణు పాల్గొన్నారు.



బాపూజీనగర్ ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో జంపన ప్రతాప్

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం బోనాల జాతర

బోయిన్‌పల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం బోనాల జాతర బతుకమ్మ, దసరా పండుగలు అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పేర్కొన్నారు. ఆషాఢమాస బోనాల పండుగను పురస్కరించుకుని సోమవారం బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో ఆలయ ధర్మకర్త దుర్గయ్య ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయ ధర్మకర్త దుర్గయ్యతోపాటు స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాపూజీనగర్ యువకులు తీసిన ఫలహారం బండ్లకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఆషాఢమాస బోనాల జాతరలో భాగంగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ మూడోవార్డు సిక్‌విలేజ్‌లోని మహాకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు జంపన ప్రతాప్‌ను శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరి, కృష్ణ, రాజు, వెంకటేష్, రాజెల్లి, సురేష్, రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా ఒకటవ వార్డు న్యూబోయిన్‌పల్లి చిన్నతోకట్ట సంజీవయ్యనగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఫలహారం బండ్లకు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అజిత్ కల్యాణ్, పవన్, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ కమిటీ సభ్యులు

తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

బౌద్ధనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ (టీయూఎఫ్) కమిటీ సభ్యులు కోరారు. టీయూఎఫ్ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాంబాబు ముదిరాజ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు దయానంద్‌గంగపుత్ర, లక్ష్మణ్, నర్సింహాచారి, మల్లారి అనిల్, జగన్, శ్యామరావు, జగదీష్, జానకిరామ్, భూపాల్ తదితరులు సోమవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలతో పాటు అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, ఉద్యమకారుడి గుర్తింపుకార్డు ఇస్తామని వాగ్దానం చేశారని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో స్వచ్ఛమైన ప్రకటన చేయాలని వారు కోరారు.



సుజాత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

బీఆర్ఎస్ నాయకురాలి అంత్యక్రియలకు తలసాని హాజరు

పద్మారావునగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు సుజాత ఆదివారం రాత్రి మృతి చెందింది. సోమవారం బన్సీలాల్‌పేట్ శ్మశానవాటికలో నిర్వహించిన అంత్యక్రియలకు మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై ఆమె పార్థివ దేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

భగాయత్‌లో సదుపాయాలను కల్పించండి

ఉప్పల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ భగాయత్‌లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని భగాయత్ ప్లాట్ ఓనర్స్‌తో పాటు కొందరు స్థానిక నాయకులు ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితారెడ్డిని కోరారు. ఈ మేరకు వారు సోమవారం కార్పొరేటర్‌తో పాటు ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ భగాయత్‌లో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఫంక్షన్‌హాల్‌ల నిర్మాణం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. భగాయత్‌లో నెలకొన్న సమస్యలన్నింటినీ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈగ సంతోష్‌ముదిరాజ్, సుధాకర్, సోము జంగయ్య, రాజేష్, సోమ్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఆలయ ప్రతినిధులు



కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సికింద్రాబాద్ శాసనసభ్యుడు పద్మారావుగౌడ్, కార్పొరేటర్ హేమ తదితరులు



పార్శిగుట్టలో ఫలహారబండ్ల ఊరేగింపులో పాల్గొన్న లష్కర్ సాధనసమితి చైర్మన్ గుర్రం పవన్‌కుమార్‌గౌడ్



మైలార్‌గడ్డలో బీజేపీ రాష్ట్రకార్యవర్గసభ్యుడు రవిప్రసాద్ గౌడ్‌ను సత్కరిస్తున్న కట్టమైసమ్మ ఆలయకమిటీ సభ్యుడు దేవేందర్‌యాదవ్

ఘనంగా బోనాల జాతర



పోతురాజు విన్యాసాల మధ్య పచ్చికుండను తీసుకెళుతున్న కట్టమైసమ్మ ఆలయ వంశీయులు



ఫలహారం బండికి పూజలు చేసి ప్రారంభిస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కే.నరసింహన్



చిలకలగూడలో నృత్యం చేస్తున్న మహిళలు

ఘనంగా తొట్టెల, ఫలహారబండ్ల ఊరేగింపు

బౌద్ధనగర్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యువతి, యువకుల నృత్యాలు, పోతరాజుల వీరంగాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల, మహిళల కోలాటాలు, విచిత్రవేషధారణలు, తొట్టెలు, ఫలహారబండ్ల ఊరేగింపు, భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమాలతో చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ బోనాల జాతర ఆద్యంతం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మా బైలెల్లినాదో పాటలతో అమ్మవారి ఊరేగింపు, సాగునంపు యాత్రలో ప్రజలు భక్తి పారవశ్యంలో చిందేశారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకైన ఆషాఢబోనాల జాతరకు వేలాదిమంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి : బొల్లారంలో రెండు రోజులపాటు జరిగిన బోనాల జాతర సోమవారం సాయంత్రం కనులపండువగా ముగిసింది. డౌటన్ బజార్‌లలో తోట ముత్యాలమ్మ దేవాలయంలో ప్రధాన అర్చకుడు చిక్కాల మహేష్ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సదర్ బజార్ మహాకాళి దేవాలయంలో అమ్మవారికి అభిషేకాలు అర్చనలు గావించారు. సాయంత్రం భవిష్యవాణి, రంగం కొనసాగింది అనంతరం అమ్మవారిని ఊరిపొలిమేరకు సాగనంపారు. దీంతో జాతర ముగిసిందని నిర్వాహకులు తెలిపారు. అలాగే సదర్ బజార్‌లోని మావురాల పెద్దమ్మ దేవాలయంలో బోనాల వేడుకలు, జాతర అంగరంగ వైభవంగా జరిగింది. పలహారం బండి ఊరేగింపు పోతరాజుల విన్యాసాలతో పురవీధుల గుండా ఊరేగించారు. పలువురు పలహారం బండికి ప్రత్యేకంగా పూజలు చేశారు.

అందరూ బాగుంటారు.. విస్తారంగా వర్షాలు కురుస్తాయి..

- రంగం కార్యక్రమంలో భవిష్యవాణి ప్రభావతి

బౌద్ధనగర్, జూలై 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అందరూ బాగుంటారని, విస్తారంగా వర్షాలు కురుస్తాయని, రైతులు చల్లగా ఉంటారని పాతబస్తీకి చెందిన మాతంగి వేల్పూల ప్రభావతి భవిష్యవాణిలో వినిపించింది. సోమవారం రాత్రి చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన రంగం కార్యక్రమంలో పచ్చికుండపై ప్రభావతి నిలబడి భవిష్యవాణి వినిపించింది. భక్తుల పూజలతో సంతృప్తి చెందానని, ఆలయ పునః నిర్మాణం జరుగుతుందని, అందరి కష్టాలు తీరుతాయని తెలిపింది. తొమ్మిది వారాలు పాటు తనకు సాకను పోసి అనుగ్రహం పొందాలంది. భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పింది. అందులో భాగంగా నిరుద్యోగ సమస్యలు కూడా తీరుతాయని, అందరికీ ఉద్యోగాలు వస్తాయని తెలిపింది. భవిష్యవాణిని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్, ఆలయచైర్మన్ గుంటి కృష్ణ పాల్గొన్నారు.



చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో సోమవారం రాత్రి భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి వేల్పుల ప్రభావతి



తోట ముత్యాలమ్మ దేవాలయం





బోయిన్‌పల్లిలో సోమవారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపులో భాగంగా హాజరైన జనం, డ్యాన్స్ చేస్తున్న యువతీయువకులు

ఇద్దరు యువతుల అదృశ్యం



మరియమ్మ

అడ్డగుట్ట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట రైల్ నిలయం అంబేడ్కర్‌నగర్ బస్తీకి చెందిన సంగం భారతి కుమార్తె సంగం మరియమ్మ(19) సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు దాంతో కుటుంబ సభ్యులు వెంటనే బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. కుటుంబ సభ్యులు కుమార్తెపై ఆరా తీస్తే మహబుబ్‌నగర్ అచ్చంపేట్‌కు చెందిన జీవన్ అనే వ్యక్తితో ఏడాది నుంచి ఇన్‌స్టాగ్రాంలో పరిచేయంతో ప్రేమించుకున్నారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మరియమ్మ తల్లి ఫిర్యాదుతో పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తానంటూ...

మారేడుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): తల్లితో బయటకి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆస్పత్రికి వెళ్లి వస్తానంటూ వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లఖన్ రాజ్ కథనం ప్రకారం.. కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలోని సిఖ్ విలేజ్ బాంటియా ఫర్నిచర్ సమీపంలో నివాసం ఉండే ఆర్మీ ఉద్యోగి మేజర్ కుమార్తె(18) ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఇటీవల జేఈఈలో ర్యాంకు సాధించింది. ఇది ఇలా ఉండగా ఈనెల 26వ తేదీన తల్లితోపాటు బయటకి వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరింది. మార్కెట్ నుంచి తిరిగి వస్తున్న సమయంలో ఆస్పత్రికి వెళ్లి తన చెవికి వైద్యం చేయించుకుంటానని తల్లితో చెప్పి వెళ్ళింది. అలా వెళ్ళిన ఆ యువతి ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో యువతి కుటుంబ సభ్యులు కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వృద్ధురాలితో ఇన్‌స్పెక్టర్ సీతయ్య

వృద్ధురాలిని ఓల్డేజ్‌హోమ్‌లో చేర్చిన పోలీసులు

చిక్కడపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎవరూ లేని ఓ వృద్ధ మహిళను చిక్కడపల్లి పోలీసులు చేరదీసి ఓల్డేజ్‌హోమ్‌లో చేర్పించారు. హిమాయత్‌నగర్‌కు చెందిన 70 సంవత్సరాల వృద్ధురాలు ఎరమిల్లి లాలమ్మ భర్త గతంలో చనిపోయాడు. ఆంధ్రప్రదేశ్ విజయవాడకు చెందిన ఆమె బాగోగులు చూసుకోవడానికి కుటుంబీకులు, సన్నిహితులు ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆమెను సోమవారం పీఎస్‌కు తీసుకువచ్చి భోజనం పెట్టించారు. ఆమెకు పాదరక్షలు ఇప్పించి ఘట్‌కేసర్‌లో ఉన్న ఓల్డేజ్‌హోమ్‌లో చేర్పించారు.

పురస్కారాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కారగ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా సినారె ప్రతిభా పురస్కారాలు ఈనెల 31న త్యాగరాయగానసభలో ప్రదానం చేస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సురేందర్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. సామాజిక కార్యకర్తలు, సేవా సంస్థల ప్రతినిధులు, కళాకారులు, కవులు, సంగీత, సాహిత్య గాన, కళా, సేవా ఉపాధ్యాయ, నటీనటులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు, జర్నలిస్ట్ రంగాలవారు దరఖాస్తు చేయవచ్చునని వివరాలకు 9550512032 నెంబర్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

592 రూట్‌లో ఆర్టీసీ బస్సులు

- మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికి 3 బస్‌ట్రిప్పులు

హైదరాబాద్ సిటీ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ నుంచి శివారు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. కొత్తగా 592 రూట్‌లో మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికి 3 బస్‌ట్రిప్పులను మంగళవారం నుంచి నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెహిదీపట్నం నుంచి కందవాడకు ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.55 నిమిషాలకు; కందవాడ నుంచి మెహిదీపట్నంకు ఉదయం 9.25, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 5.10 నిమిషాలకు బస్ ట్రిప్పులు అందుబాటులో ఉంటాయన్నారు. మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సులు మెహిదీపట్నం నుంచి వయా నానల్‌నగర్, లంగర్ హౌస్, టీకేబ్రిడ్జి, బండ్లగూడ క్రాస్‌రోడ్, ఆరెమైసమ్మ, అప్పా, గోల్డెన్ పామ్స్, ఉస్మాన్‌సాగర్ క్రాస్‌రోడ్స్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ క్రాస్‌రోడ్, మోయినాబాద్, కనకమామిడి ఎక్స్‌రోడ్, కేతిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్, అప్పారెడ్డిగూడ క్రాస్‌రోడ్, టోల్‌కట్టా క్రాస్‌రోడ్, ముడిమల్ క్రాస్‌రోడ్, కందవాడ ఎక్స్‌రోడ్, మల్లాపూర్, కాసారం, కందవాడ, చేవేళ్ల వరకు బస్సులు నడుపుతామన్నారు. ప్రయాణికుల అవసరాలమేరకు ట్రిప్పుల సంఖ్య పెంచుతామన్నారు.

ఘనంగా కావడి పాల్కొడి ఉత్సవం



పాల చెంబుతో చిన్నారి



కావడితో బాలుడు



కావడి, పాల చెంబులతో ఆలయంలోకి ప్రవేశిస్తున్న భక్తులు

పద్మారావునగర్, జులై 29 (ఆంధ్రజ్యోతి): స్కందగిరిలో ఘనంగా కావడి, పాల్కుడి ఉత్సవం,పద్మారావునగర్,స్కందగిరిలోని శ్రీ సుబ్రమన్యస్వామి దేవాలయంలో సోమవారం త్రైమాసం ఆడికృతిక సందర్భంగా ఉదయం నుండే వందల సంఖ్యలో భక్తులు కావడి, పాలకుండలతో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. భక్తులు మేళతాళాల నడుమ, భక్తిపారవశ్యంతో నృత్యాలు చేస్తూ కావడి, పాలకుండలతో గిరి ప్రదక్షిణం చేసిన అనంతరం ఆలయానికి చేరుకొని పాలకుండలను శ్రీ సుబ్రమణ్యస్వామి అభిషేకానికి సమర్పించి, స్వామిని దర్శించుకొన్నారు. భక్తులు తమ కోరికలు తీర్చుకోవటానికి, తీరినకోరికల కోసం ఆలయంలో ప్రతీ సంవత్సరం జరిగే ఈ కార్యక్రమంలో కావడి, పాలకుండలతో పాల్గొంటారు. ఆలయ చుట్టుపక్కల ప్రాంతాల నుండే కాక నగరంలోని అనేక ప్రాంతాల భక్తులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణచేసారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాపిక్ పోలీసులు డ్యూటీ నిర్వహించారు.